క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

పెద్దశంకరంపేట(మెదక్): నేషనల్ మీమ్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు పెద్దశంకరంపేటలోని మోడల్‌స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన కె.వర్షిక, జి.సాహితి, కె.సాహితిలు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సమష్టి కృషితోనే గ్రామాల స్వచ్ఛత


మాట్లాడుతున్న ఎంపీడీఓ శశిప్రభ

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల స్వచ్ఛత సమష్టి కృషితోనే సాధ్యమవుతుందని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. శనివారం ఆమె మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీ 2023 అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త వేరు చేసి, వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలన్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యాంకుమార్, ఈసీ భగవాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గప్రసాద్ తెలిపారు. చిన్నగొట్టిముక్ల, పాంబండ సబ్‌స్టేషన్ల మరమ్మతుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సబ్‌స్టేషన్ల గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

పీఎం స్కీంను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్ రూరల్: ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజు, సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, ఐకేపీ ఏపీఎం గౌరీ శంకర్ మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లిలో ప్రధానమంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ స్కీం ద్వారా 35 శాతం సబ్సిడీతో మంజూరైన పిండి గిర్నిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సాపూర్ మండలానికి ఆహార ఉత్పత్తి రంగంలో 23 యూనిట్లు టార్గెట్ ఉందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ హరికృష్ణ, గ్రామ సంఘం లీడర్ నాగరాణి, చంద్రకళ, సంగమేశ్వర్, మహిళలు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నర్సాపూర్: నర్సాపూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ 12వ వార్షికోత్సవాల వాల్‌పోస్టర్‌ను శనివారం ఆలయంలో పట్టణ గౌడ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఆలయ ఉత్సవాలు ఈనెల 24 నుంచి రెండు రోజుల పాటు ఆలయ అర్చకుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో కొనసాగుతాయని గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్‌గౌడ్‌లు చెప్పారు. ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో వారితో పాటు సంఘం నాయకులు యాదాగౌడ్, అశోక్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, సత్యంగౌడ్, రమేశ్‌గౌడ్, సుభాశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యం అయిన మహిళ ఆచూకీ లభ్యం

తూప్రాన్: మంత్రాల నెపంతో ఓ మహిళను గ్రామస్తులు కొట్టడంతో అవమానంతో ఇంటి నుంచి కనిపించకుండా పోయిన మహిళ ఆచూకీని పోలీసులు శనివారం యాదగిరిగుట్ట వద్ద కనుగొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 16న తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి మంతూర్ మైసమ్మ అనే మహిళ అదృశ్యం అయిన సంగతి తెలిసిందే. కుమారుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు యాదగిరిగుట్ట వద్ద ఉన్నట్లు సమాచారం మేరకు మహిళలను కుటుంబ సభ్యులకు అప్పగించామని పోలీసులు చెప్పారు.

పూరి గుడిసెలో చోరీ

తూప్రాన్: తాళం వేసిన పూరిగుడిసెలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని నాగులపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఒంటరి మహిళ కుమ్మరి శివలక్ష్మి శుక్రవారం తన పూరి గుడిసెకు తాళం వేసి పక్కనే ఉన్న మన్నే కవిత ఇంట్లో రోజు మాదిరిగానే నిద్రించింది. ఇదే అదనుగా బావించిన దొంగలు గుడిసే తాళం పగుల గొట్టి పెట్టెలో దాచి పెట్టిన రూ.42,500 నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం ఆమె వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి నగదును దొంగతనం చేశారని గుర్తించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

కొడిపల్లి(నర్సాపూర్): సీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ రాజు నాయక్ అన్నారు. శనివారం కొడిపల్లి సీహెచ్‌సీలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశంలో ఎంపీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని, సీహెచ్‌సీలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యం అందించాలని చెప్పారు. వైద్యసిబ్బందికి సమస్యలుంటే తెలియచేయాలన్నారు. మందుల కొరత ఉండొద్దన్నారు. గ్రామాల్లో వేసవి సందర్భంగా ఎండదెబ్బ తగిలే వారికి వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి వైద్యం చేయాలని సూచించారు. అనంతరం మండలంలో 14 సబ్‌సెంటర్లకు మంజూరు అయిన బీపీ మీటర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీకాంత్, డాక్టర్ ఫర్హాజ్, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు శశికళ, లక్ష్మి, ఆస్పత్రి సూపర్‌వైజర్లు మార్త, రమేశ్, వైద్యసిబ్బంది శ్రీధర్‌రెడ్డి, ప్రమీళ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సిబ్బంది పాత్ర కీలకమని జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, రోగులకు వైద్య సేవలు చేయాలన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందిస్తే, రోగుల సంఖ్య పెరిగే అస్కారం ఉంటుందన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందివ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, వైద్యులు సాయిసౌమ్య, సంధ్య ఉన్నారు.

నిజాంపేట(మెదక్): మండలంలోని వెంకటపూర్(కె) గ్రామాల్లో జన ఆరోగ్య సమితి కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు భారత ప్రభుత్వం ఆయూష్మాన్ ప్రోగ్రాం క్రింద గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సబ్ సెంటర్‌లను హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్చారు. ఇందులో గర్భిణులు నమోదు, బాలింతల బాగోగులు, చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధులకు ముందస్తు పరీక్షలు నిర్వహించి ప్రాథమిక చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ


బీపీ మీటర్ల పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజునాయక్

సేవలు సక్రమంగా నిర్వహించడానికి జన ఆరోగ్య సమితి కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో చైర్ పర్సన్‌గా సర్పంచ్ అనిల్, కో చైర్‌పర్సన్‌గా డా. హరిప్రియ, మెంబర్ సెక్రెటరిగా ఎమ్ఎల్‌హెచ్‌పీ స్వాతి, కమిటీ మెంబర్లుగా నార్లాపూర్ సర్పంచ్ అమరసూనారెడ్డి, తిప్పన్నగుల్ల సర్పంచ్ చంద్రవర్ధిని, రమ్య గ్రామ కార్యదర్శి ప్రేమ, ఆశ కార్యకర్తలు కవిత, బాలమణి, సునీత, పద్మ, అంగన్‌వాడీ కార్యకర్త యశోద, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్యను పెంచాలని ఎంపీపీ సబిత సూచించారు. శనివారం ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో ఎంపీటీసీ సత్యనారాయణ, తహసీల్దార్ సత్యనారాయణ, శేరిపల్లి సర్పంచ్ మల్లేశం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి సదస్సులో పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్ పల్లె దవాఖానాలో శనివారం ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లేవల్ హెల్త్ ప్రొవైడర్) ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి (జేఏఎస్) సమావేశంలో సర్పంచ్ పద్మ కిష్టయ్య, ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ కవిత, ఎంపీటీసీర స్వప్న, మండల బీఆర్


రామాయంపేట(మెదక్): మాట్లాడుతున్న ఎంపీపీ సబిత


శివ్వంపేట(నర్సాపూర్): పీహెచ్‌సీలో..

ఎస్ పార్టీ అధ్యక్షుడు సార రామాగౌడ్, నాయకులు అమర్‌సింగ్, కిశోర్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్ కవిత, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో ఎంపీపీ చింత స్వప్న, జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిలా, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ భారతి, డాక్టర్ కృతిక, ఎంపీటీసీ వాణి, మిషన్ భగీరథ ఏఈ సాయికృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో వైద్య పరీక్షల పరిశీలన

కొడిపల్లి(నర్సాపూర్): మండలం కేంద్రం కొడిపల్లిలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలను ఐడీసీఎస్ మండల సూపర్‌వైజర్లు శశికళ, లక్ష్మి శనివారం పరిశీలించారు. ఏఎన్‌ఎం సిరోమణి, శోభ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఫరీద, నిర్మల, ఆశ కార్యకర్తలు చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.


కొడిపల్లి(నర్సాపూర్): మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

రామాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

పెద్దశంకరంపేట(మెదక్): రామ మందిరం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా బాలాలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ సీతారామచంద్రులకు ప్రత్యేక పూజలతో పాటు హోమాన్ని నిర్వహించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కనకరాజు, ఎంపీపీ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళిపంతులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, అనిల్‌కుమార్, రవి, పురోహితులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పర్యవేక్షించాలి

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలను, ఇతర భవన నిర్మాణాలను ఇంజనీరింగ్ శాఖ అధికారులు సరిగా పర్యవేక్షించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేనందున పనులు నాణ్యత లోపించే ప్రమాదం ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో పలు సీసీ రోడ్ల నిర్మాణంలో ఇసుకను వాడడం లేదని, పూర్తిగా రోబో సాండ్‌ను వాడుతూ ప్రభుత్వ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఇతర సిబ్బంది పర్యవేక్షణ లేకుండానే రాత్రి పూట స్లాబ్ వేయడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ దృష్టికి తీసుకుపోగా.. సీసీ రోడ్ల నిర్మాణాలను పర్యవేక్షించేలా ఆయా శాఖ అధికారులకు సూచిస్తానని చెప్పారు.

రైతు సమస్యలు చెప్పడానికి వెళ్తే అరెస్టులా!

పాపన్నపేట(మెదక్): రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను తెలపడానికి హైదరాబాద్‌లోని సివిల్ సప్‌లై కార్యాలయానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నియంతృత్వానికి పరాకష్ట అని మెదక్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బుధవారం రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సమావేశమై, సమస్యలను చర్చించి, సివిల్ సప్లై కమిషనర్‌కు విన్నవించడానికి కార్యాలయానికి వెళ్లామన్నారు. అక్కడ పోలీసులు తమను అరెస్ట్ చేసి, బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

నల్లపోచమ్మకు బోనాలు


బోనాలతో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని బిక్యా పంచాయతీ పరిధిలో నల్ల పోచమ్మ ఉత్సవాలు శనివారం ప్రారంభమైనవి. అందులో భాగంగా ఆదివారం నల్ల పోచమ్మకు నాను, బిక్యా తండావాసులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించడంతో పాటు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

లారీల సమస్య తీర్చండి


సహకార సంఘం వైస్ చైర్మన్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చేగుంట(తూప్రాన్): ధాన్యం తరలింపు కోసం లారీలు కావాలని అదనపు కలెక్టర్ రమేశ్‌ను ఇబ్రహీంపూర్ సహకార సంఘం వైస్ చైర్మన్ తానీషా కోరారు. మెదక్ వెళ్తున్న అదనపు కలెక్టర్ రమేశ్ రెవెన్యూ అధికారులను చూసి కారును ఆపారు. కొనుగోలు కేంద్రాలకు లారీల కోసం చేగుంటకు వచ్చిన వైస్ చెర్మన్ తానీషా ధాన్యం తరలింపునకు లారీల ఇబ్బంది ఉందని తెలిపారు. స్పందించిన అదనపు కలెక్టర్ అవసరమైతే కామారెడ్డి నుంచి లారీలను తెప్పించి ధాన్యం తరలింపునకు సహకరిస్తానని అన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నార్సింగి మండల కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ అధ్యక్షుడిగా సుధాకర్**

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన మత్స్య కార్మిక విభాగం నార్సింగి మండల అధ్యక్షుడిగా గుర్రాల సుధాకర్ ఎన్నికైనారు. ఈ మేరకు శనివారం పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. నార్సింగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసగౌడ్, డీసీసీ నాయకులు యాదగిరి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు స్వామి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

◆ **ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని అప్పాజీపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు, సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కన్నెబోయిన ధన్‌రాజ్ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా మల్లేశం, కోశాధికారిగా శేఖర్, ప్రచార కార్యదర్శిగా కిషన్, సభ్యులుగా చలం యాదగిరి, గోపాల్, దుర్గయ్య, నర్సింలు, సుధాకర్, షేఖులు, చంద్రశేఖర్, ప్రవీణ్, శ్రీశైలం, శ్రీహరి, దేవయ్య ఎన్నికైనట్లు తెలిపారు.

◆ **ముదిరాజ్ యువసేన కమిటీ ఏర్పాటు**

నర్సాపూర్: మండల ముదిరాజ్ యువసేన కమిటీ ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దిగంబర్ తెలిపారు. శనివారం పలువురికి నియామక పత్రాలు అందజేశారు. మండలంలోని హన్మంతాపూర్ గ్రామానికి చెందిన యువసేన అధ్యక్షుడిగా నల్ల ఆంజనేయులును ప్రధాన కార్యదర్శిగా మన్నె అర్జున్, కోశాధికారిగా చందు, ఉపాధ్యక్షుడిగా అనిల్, భాస్కర్ తదితరులను నియమించినట్లు ఆయన చెప్పారు. ముదిరాజ్‌లను ఐక్యం చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

◆ **కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం**

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని ప్రభుత్వ శ్రీ రాయరావు సరస్వతీ మెమోరియల్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి పాసైన ఆసక్తి గల విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో తెలుగు మీడియంలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. విద్యార్థులకు ఉచిత విద్య, టెక్స్ట్ బుక్స్ అందించడంతో పాటు ఎన్‌ఎస్‌ఎస్ వంటి సేవా కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తామన్నారు.

◆ **వైభవంగా ఉమా ధర్మలింగేశ్వరస్వామి ప్రతిష్ఠ**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ధర్మారం గ్రామంలో ఉమా ధర్మలింగేశ్వరస్వామి దేవాలయాన్ని గ్రామస్తులు దాతల సహకారంతో పునః నిర్మించారు. దీంతో ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం ఘనంగా ప్రారంభించారు.

◆ **పాత ఇళ్లను తొలగించాలి**

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని భీంరావుపల్లి గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. పాత ఇళ్లను తొలగించడంతో పాటు కొత్తగా మురుగుకాల్వలు నిర్మించాలని, శానిటేషన్ విషయమై చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. గ్రామసభలో సర్పంచ్ ఎల్లమ్మ, వార్డు సభ్యులు భూషణం, నర్సింలు, గ్రామ కార్యదర్శి స్వాతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **అభివృద్ధి పనుల పరిశీలన**

నర్సాపూర్: మున్సిపాలిటీ పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని రెండు, మూడు వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. రెండు వార్డుల్లో మురికి కాల్వలను శుభ్రం చేయించడంతో పాటు వీధి దీపాలు చెక్ చేయించామని ఇతర పనులు చేపట్టామని ఆయన వివరించారు.

◆ **చిన్నశివునూర్ గ్రామంలో స్వచ్ఛభారత్**

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిన్నశివునూర్ గ్రామంలో సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులను పరిశుభ్రం చేసి, గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, పంచాయతీ కార్యదర్శి రంగమ్మ, పాలకవర్గ సభ్యులు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

◆ **55వ రోజుకు చేరిన దీక్షలు**

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధనకై అఖిలపక్షం ఆధ్వర్యంలో రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు శనివారం నాటికి 55వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో యాదవ సంఘం సభ్యులు కూర్చున్నారు. డోలు వాయిస్తూ ఊరేగింపుగా వచ్చిన సంఘం సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రభుత్వం వెంటనే డివిజన్ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. దీక్షలో అఖిలపక్షం నేతలతో పాటు యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ **జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని టోప్యాతండాలో సేవాలాల్, జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తండాలో నిర్వహించిన సేవాలాల్, జగదాంబ ఉత్సవంలో భాగంగా మోహన్ మహరాజ్ భోగ్ బండార్ యాగం నిర్వహించారు. నాయకుడు రాంధన్ ఉన్నారు.

బస్తాలులేవు.. లారీలు రావు


నిజాంపేట(మెదక్): గోదాంను పరిశీలిస్తున్న అధికారులు


కొడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో..

కొడిపల్లి(నర్సాపూర్): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నింపేందుకు గన్ని బస్తాలు లేవని నింపిన ధాన్యం తరలించేందుకు లారీలు రావడంలేదని వెల్మకన్న గ్రామ సర్పంచ్ కాజిపేట రాజేందర్ విమర్శించారు. శనివారం గ్రామస్తులతో కలిసి గ్రామ ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సౌకర్యాలు మాత్రం కల్పించలేదన్నారు. దీంతో కేంద్రాల వద్ద రైతులకు సమస్యలు తప్పడం లేదన్నారు. వారం రోజులుగా లారీలు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ధాన్యం నింపేందుకు కేంద్రంలో గన్ని బస్తాలను సైతం ప్రభుత్వం సరఫరా చేయడం లేదని విమర్శించారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పొంతనలేని మాటలు చెప్తు కాలయాపన చేస్తున్నారని రైతుల సమస్యలను మాత్రం తీర్చడం లేదన్నారు. కార్యక్రమంలో రైతులు రాములు, రవి, ముత్యాలు, చిన్న, బీమ్లా తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి సాయి బాబా, డీఎల్‌పీఓ రాజేంద్రప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ లేకుండా చూడాలని సూచించారు. అనంతరం నిజాంపేట గ్రామంలో స్పెషల్ డ్రైవ్ శానిటేషన్‌లో భాగంగా పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సతీశ్, మండల తహసీల్దార్ ప్రభాకర్, ఇన్‌చార్జ్ ఎంపీఓ వెంకట నర్సింహారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీలత, కావేరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం త్వరగా ఖాళీ చేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న ధాన్యం వాహనాలు త్వరగా ఖాళీ అయ్యేలా చూడాలని రైస్ మిల్లు యజమానులకు అదనపు కలెక్టర్ రమేశ్, డీఎస్ఓ శ్రీనివాస్‌రావు సూచించారు. శనివారం మాసాయిపేటలోని వెంకటసాయి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును వారు సందర్శించారు. కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పేరుకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది దగ్గరుండి రైతులకు ఇబ్బంది రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో మొక్కలను సంరక్షించాలి

కొల్చారం(నర్సాపూర్): వేసవికాలం ఎండలు మండుతున్న తరుణంలో రహదారుల వెంట నాటిన మొక్కలను, గ్రామ నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండకుండా సంరక్షించాలని ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. శనివారం పోతం శెట్టిపల్లి గ్రామ శివారులోని మెదక్ నర్సాపూర్ జాతీయ రహదారి వెంట నాటిన మొక్కలను ఎంపీడీఓ పరిశీలించారు. మొక్కలు ఎండకుండా ఎప్పటికప్పుడు నీటిని పెట్టాలని సూచించారు. అక్కడ నుంచి గ్రామంలో ఐకేపీ ద్వారా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి అరుంధతి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.


మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

‘ప్రజాఆరోగ్య స్థితిగతులను గుర్తించాలి’

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో ప్రజా ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు గుర్తించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అరుణశ్రీ అన్నారు. శనివారం మనోహరాబాద్ పీహెచ్‌సీ కేంద్రంలో నూతనంగా కమిటీ ఏర్పాటు కావడంతో మొదటి కమిటీ సమావేశాన్ని ఎంపీపీ పురం నవనీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా క్షయ నివారణ అధికారి డా. రామ్మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అరుణశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజా ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. మనోహరాబాద్ పీహెచ్‌సీ, కాళ్లకల్ సబ్ సెంటర్‌ల్లో సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆనంద్, జోత్స్నదేవి, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఏపీఎం పెంటాగౌడ్, సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ నవనీత

23న అంబేద్కర్ జీవిత చరిత్ర నాటిక ప్రదర్శన

పెద్దశంకరంపేట(మెదక్): ఈ నెల 23న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సంఘం శరణం గచ్ఛామి నాటిక నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో అంబేద్కర్ యువజన సంఘం, కేవీపీఎస్‌ల ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, దుర్గయ్య, సాయిలు, సురేశ్, లక్ష్మణ్, పరువయ్య, కేవీపీఎస్ జిల్లా కోశాధికారి తుకారం, అరుణ్, శేషు, తదితరులున్నారు.

నాసిరకం విత్తనాలపై జాగ్రత్తగా ఉండాలి

రామాయంపేట(మెదక్): నాసిరకం విత్తనాల విషయమై రైతులు జాగ్రత్తగా ఉండాలని రామాయంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు వసంత సుగుణ సూచించారు. నార్సింగి వ్యవసాయ కార్యాలయంలో శనివారం జరిగిన రైతు అవగాహన సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. విత్తనాల కొనుగోలు విషయమై జాగ్రత్త చర్యలు అవసరమన్నారు. ఎస్ఐ నర్సింలు మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న వ్యాపారుల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి యాదగిరి, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ వసంత సుగుణ

పంటలను రక్షించుకునే విధానంపై అవగాహన

రామాయంపేట(మెదక్): వన్యప్రాణుల నుంచి పంటలను రక్షించుకునే విధానం గురించి వ్యవసాయశాఖ వారు శనివారం మండలంలోని పర్వతాపూర్, దంతేపల్లి తండాల రైతులకు అవగాహన కల్పించారు. ఇటీవల కోతులు, నెమళ్లు, అడవి పందులు, దుప్పులు, పక్షులు, ఇతర జంతువులు పంట చేలను నష్టపరుస్తున్నాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం చీడల యాజమాన్యం విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సునీత అన్నారు. పైపు లాంటి పరికరంతో పెద్ద శబ్దం చేస్తే వన్యప్రాణులు బెదిరి పారిపోతాయని ఆమె పేర్కొని దాని వినియోగం విషయమై గిరిజనులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వసంత సుగుణ, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయికృష్ణ, నరేశ్, పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ

నిజాంపేట(మెదక్): పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల నేల భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకే గుణం పెరుగుతుందని నిజాంపేట మండల వ్యవసాయ అధికారి సతీశ్ సూచించారు. ఈ మేరకు శనివారం నిజాంపేట మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పచ్చి రొట్ట ఎరువుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, సర్పంచ్ అనూష లక్ష్మీనర్సింలు, నిజాంపేట పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, రైతుబంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ కొమ్మాట చంద్రయ్య, ఏఈఓలు శ్రీలత, కావేరి, రైతులు కిష్టారెడ్డి, వెంకటేశం, శ్రీశైలం పాల్గొన్నారు.

పరిష్కారం కాని సమస్య

నిజాంపేట(మెదక్): నిజాంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ సమస్య పరిష్కారం కాలేదని జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ సర్పంచ్ వడ్ల తిరుమలయ్య పదేళ్ల క్రితం చేసిన వెంచర్‌లో 10 శాతం భూమిని గ్రామ పంచాయతీకి దానం ఇచ్చాడని.. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ ధరలు పెరగడంతో ఆ భూమిని దాన పూర్వకంగా చూపడం సబబు కాదని అంటున్నాడని జెడ్పీటీసీ ఆరోపించాడు. తిరుమలయ్య ప్రస్తుతం దాన రూపకంగా ఇచ్చిన భూమిలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ వెంచర్‌లో ఉన్న రోడ్లు, 10 శాతం భూమిని గ్రామ పంచాయతీకి వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలో కొద్ది రోజులుగా ఉన్న సమస్యను పరిష్కరించడానికి వచ్చిన ఆర్డీఓ సాయిరాం సమస్యను పూర్తిగా వినకుండా మధ్యలో నుంచే వెనుదిరిగి వెళ్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈవిషయమై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను చర్చించడానికి ముందుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీలు సిద్ధరాములు, రాధాకిషన్, ఎంఈఓ నీలకంఠ, తహసీల్దార్ ప్రభాకర్, గంగ ప్రసాద్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.